# దద్దమ్మ

"వసూ! వసూ!"

టెలిగ్రాంతో హడావిడిగా వంటింటి గుమ్మం లోకి వచ్చి నిలబడ్డాడు సుబ్బారావు.

భర్త హడావుడిమనిషని తెలుసు వసుమతికి. అందుకే తల తిప్పి కూడా చూడలేదు.

"మధ్యాహ్నం బండికి సూర్యం వస్తున్నాడు."

వసుమతి తల తిప్పి ప్రశ్నార్థకంగా చూసింది.

"సూర్యం గుర్తులేడా? ఐ. ఏ. యస్. ఫ్రెండ్ అని చెప్తుంటాను చూడు! వెస్టు బెంగాల్‌లో కలెక్టరుగా ఉన్నాడని ఎన్నోసార్లు చెప్పాను గుర్తులేదూ?"

"అయితే ఏమంటారూ?"

'పదిహేను రోజులు సెలవుమీద వస్తున్నాడు. గుంటూరు వాళ్ళమ్మగార్ని చూట్టానికి వెళ్తున్నాడట. నాలుగు రోజులు హైదరాబాద్‌లో ఉంటానన్నాడు. ఎందుకో తెలుసా?'

'నాకేం తెలుసు?'

'నాకోసం– కేవలం నాకోసం– ఎంత గొప్పవాడైనా చిన్ననాటి స్నేహితుడికి ఆమాత్రం గౌరవం ఇవ్వడా?' ఉబ్బిపోతూ అన్నాడు.

వసుమతి భర్త ముఖంలోకి జాలిగా చూసింది.

అంతా చిన్నపిల్లవాడి తత్వం. ఎవరో గొప్పవాళ్ళయితే ఈయనకేమిటి ఇంత పట్టలేనితనం!

'మీకు ఆఫీసు టైం అయింది' అన్నది వసుంధర మామూలుగా.

'ఇవ్వాళ ఆఫీసుకు వెళ్ళడం లేదు'.

"ఏం ?"

"మా వాడ్ని రిసీవ్ చేసుకోవద్దూ? వాడి కూర్కా డా వంటచెయ్. వాడికి వంకాయ కూరంటే ఇష్టం. సేమియా పాయసం అంటే కూడా ఇష్టం. ఆఁ మర్చిపోయాను. బూడిద గుమ్మడికాయ వడియాలు వేయించడం మర్చిపోకు. గుంటూరువాడుగా? చల్ల మిరపకాయలుకూడా వేయించు."

"అయిందా లిస్టు!" చిరాగ్గా అన్నది వసుమతి.

"మజ్జిగ పులుసు కూడా..." భార్య ముఖంలోకిచూసి ఆగిపోయాడు సుబ్బారావు.

"ఎవరో గొప్పవాళ్ళయితే మీరెందుకండీ అంత వళ్లు పట్టకుండా ఉబ్బిపోతారూ?" జాలిగా చూస్తూ అన్నది.

"అదేమిటే వసూ అలా అంటావ్? వాడు నా క్లోజ్ ఫ్రెండ్. నా ఫ్రెండు గొప్పవాడైతే నాకు గర్వకారణం కాదూ?"

వసుమతి భర్త ముఖంలోకి ఓ క్షణం చూసి 'సరేలెండి వెళ్ళి మీ పనేదో చూసుకోండి' అన్నది.

సుబ్బారావు ఉషారుగా బయటికి వెళ్ళాడు.

వసుమతి కాపరానికి వచ్చి ఎనిమిది నెలలైంది. ఆమె అన్నలిద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. వసుమతి కూడా బి. ఎ. పాసయ్యింది. ఎం. ఏ. చదవాలని ఉండేది కాని పెళ్ళి కావడంతో ఆ అభిప్రాయం మార్చుకుంది.

సుబ్బారావు ఎం. ఏ. పాసయ్యాడు. ఇంగ్లీషు లిటరేచర్‌తో ఎం. ఏ. చేశాడు. క్లాసు రానందువల్ల సెక్రటేరియట్‌లో డైరెక్టు యు.డి.సి. (ఇప్పుడు సీనియర్ అసిస్టెంటు అంటున్నారు) గా చేరేడు. అతడి ఆస్తిపాస్తులు బాగానే ఉన్నాయి. స్ఫురద్రూపి. అతను నచ్చలేదని అనడానికి ఏ కారణం కన్పించలేదు వసుమతికి. అతడికి మంచివాడనేపేరు ఉంది. వసుమతి కాపరానికి వచ్చాక అతడి మంచితనంలో చేతగానితనం, అమాయకత్వం ఉన్నాయని గ్రహించింది.

పదిమంది మధ్యలో తన భార్యను గొప్పగా పరిచయం చేస్తాడు. అంతవరకు ఎలాగైనా సరిపెట్టుకోగలదు వసుమతి. కాని అంతటితో ఆగడే? తన బావమరుదులు చాలాచాలా గొప్ప

వాళ్ళని చెప్పడం ప్రారంభిస్తాడు. అది విని ఎదుటివాళ్ళు ముసిముసిగా నవ్వుకోవడాన్ని కూడా అతడు గ్రహించడు. వసుమతికిమాత్రం తల కొట్టేసినట్టుగా అన్పిస్తుంది. ఇంటికి వచ్చాక ఆ విషయం మీద చాలా చాలా చెబుతుంది. అయినా అతడు తన అలవాటును మార్చుకోలేదు.

చాలా మందికి ఈ జబ్బు ఉంటుంది. తమ బంధువుల్లో ఎంతమంది గొప్పవాళ్ళున్నారో లిస్టు చదువుతారు. తమకు ఎలాంటి గొప్ప మిత్రులున్నారో చెప్పి ఎదుటివాళ్ళను ఇంప్రెస్ చెయ్యడానికి ప్రయత్నిస్తారు. సినిమా హీరోల తోనూ, రాజకీయ నాయకులతోనూ ఎలాగో కష్టపడి ఫోటోలు తీయించుకుంటారు. ఇంటికొచ్చి ప్రతివాళ్ళకు అవి చూపిస్తూ తనే హీరో అయిపోయినట్టు లేక రాజకీయ నాయకుడు అయిపోయినట్టు ఇలాంటి మనస్తత్వం ఉన్నవాడు పొంగిపోతాడు. ఇలాంటి వారి ధోరణి ఎప్పుడూ వన్‌వే ట్రాఫిక్‌గా ఉంటుంది. ఎదుటివాళ్ళ ఫీలింగ్స్ ఎలా వున్నాయో పట్టించుకోరు.

అదే కోవకు చెందినవాడు సుబ్బారావు. వసుమతికి భర్త అమాయకత్వంమీద జాలి వేస్తుంది. కోపం వస్తుంది. ఆమె భర్త ధోరణి మార్చాలని ప్రయత్నిస్తూనే ఉంది.

సుబ్బారావు తెలివితక్కువవాడు కాదు. స్కాలర్ అనవచ్చు. పుస్తకాలు తెగ చదువుతాడు. ఏ కవి ఎక్కడ

ఏం చెప్పాడో కోట్ చెయ్యగలడు. అయితేనేం ఆ ఒక్క గుణం అతడ్ని సమాజం ముందు అమాయకుడిగా నిలోబ్చెడుతుంది.

వసుమతి వంట పూర్తిచేసి భర్తకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

రెండున్నరకు ఇంటిముందు కారు ఆగింది. భర్తతో పాటు సన్నగా పీలగా ఉన్న మరో యువకుడు కారు దిగి లోపలకు రావడం గమనించింది. ఇదేమిటి ఇతను ఐ.ఎ.యస్. ఆఫీసరా! వాళ్ళు చాలా అందంగా, శరీర సౌష్టవంతో ఉంటారని భావించేది. తన భర్త పక్కన ఎంత పీలగా కన్పిస్తున్నాడో! పులి పక్కన నక్కలా ఉన్నాడు.

"మై మిసెస్ వసుమతి!" అని వసుమతికేసి చూస్తూ "వసూ! వీడేం చేశాడో చూశావా? అసలు మనింట్లో నే దిగుతాడనుకొన్నాను. లేక్ వ్యూ గెస్టు హౌస్‌లో దిగాడు"

సుబ్బారావు ఎగ్జైటెడ్‌గా ఉన్నాడు. ఒక ఐ. ఏ. యస్. ఆఫీసర్ని "వీడు" అని అనగలిగిన తన అదృష్టానికి పొంగిపోయాడు.

వసుమతి నమస్కరించింది.

ప్రతినమస్కారం చేసి "ఇక్కడకు ఆఫీసు పని మీద వచ్చాను. అక్కడైతే కారు ఉంటుంది. మా బాచ్‌వాళ్ళు ఇక్కడ చాలామంది ఉన్నారు. వాళ్ళు వస్తూవుంటారు"

అంటూ సంజాయిషీ ఇచ్చాడు సుబ్బారావు ఐ. ఏ. యస్. మిత్రుడు సూర్యం.

వసుమతి 'ఫర్వాలేదండీ!' అంతకంటే ఏమనాలో తోచలేదు వసుమతికి.

భోజనాల దగ్గర సుబ్బారావు తమ చిన్ననాటి సంగతులను ఒకటే ఏకరువు పెడ్తున్నాడు. సూర్యం గంభీరంగా వింటూ మధ్య మధ్య ఒకటి రెండు మాటలు మాత్రం అంటున్నాడు. వసుమతికి నక్కలా ఉన్న ఆ రూపంలో పులిలాంటి వ్యక్తిత్వం కన్పించింది. పర్సనాలిటీ అంటే కేవలం రూపం మాత్రమే కాదు. చెవికోసిన మేకలా ఊరికే మాట్లాడుతున్న భర్తమీద చిరాకు వేసింది. పులిలాంటి విగ్రహంలో ఉన్నది ఏమిటి? మేకపోతా?

భోజనాలు అయాక మిత్రులిద్దరూ బెడ్ రూంలో పడుకున్నారు. కబుర్లు చెప్తున్నాడు సుబ్బారావు. వింటూ వింటూనే నిద్రలోకి జారిపోయాడు సూర్యం.

వంటింట్లోనుంచి గిన్నెల చప్పుళ్ళు విన్పిస్తున్నాయి. సుబ్బారావు చివ్వున లేచి వంటింట్లోకి వచ్చాడు.

"వాడు నిద్రపోతున్నాడు. శబ్దాలు చెయ్యకు" గొంతు తగ్గించి గుసగుసగా మాట్లాడాడు!

వసుమతికి వళ్ళు మండిపోయింది. తలెత్తి భర్తముఖంలోకి చూసింది. ఆ చూపుల్ని తట్టుకోలేనట్టు వెనక్కు దిరి

వంటింట్లో నుంచి బయటికి వచ్చాడు. 'పిచ్చివాడు' మనసులో అనుకొని నిట్టూర్చింది వసుమతి.

సూర్యం నిద్ర లేచాడు. సుబ్బారావు హడావిడి చేశాడు. కాఫీ, టిఫెన్లు బల్లమీదకు వచ్చాయి. సూర్యం కాఫీ మాత్రం తీసుకున్నాడు. టిఫెన్ తీసుకోనందుకు సుబ్బారావు బోలెడంత బాధపడిపోయాడు. "ఒరే-అరే" అని మాట్లాడుతూ ఉంటే సూర్యం అదోలా ముఖం పెట్టు కోవడం వసుమతి గమనించింది. ఏదో చెప్తూ సూర్యం వీపు మీద చరిచి "చూశావా? ఒక పెద్ద ఆఫీసర్ని నేను వీపుమీద చరచగలను" అన్నట్లు గర్వంగా భార్య ముఖంలోకి చూశాడు. ఆమె సూర్యం ముఖంలోకి చూసింది. అతడి ముఖం గంభీరంగా ఉంది.

సినిమాకు వెళ్దామని పట్టుపట్టాడు సుబ్బారావు. సూర్యం ఒప్పుకోక తప్పలేదు. 'వదినగార్ని కూడా తీసుకెళ్దాం' అన్నాడు సూర్యం వసుమతి ముఖంలోకి చూస్తూ. అతడి చూపులు ఆమెకు నచ్చలేదు. 'వసూ! వస్తావుగదూ ?' ఉషారుగా అన్నాడు సుబ్బారావు.

'నేను రానులెండి, మీరెళ్ళండి.'

'మీకు అభ్యంతరం అయితే వద్దులెండి'

"అబ్బే! నీతో సినిమాకి రావడానికి అభ్యంతరం ఏమిట్రా? వసూ! వాడంత సర్దాపడ్తుంటే రానంటావేం? తయారవు" అన్నాడు సుబ్బారావు.

వసుమతి లోపలకు వెళ్ళిపోయింది. అయిష్టంగానే తయారై బయటకు వచ్చేసరికి సుబ్బారావుకోసం ఆఫీసరు కారు పంపించాడు.

'వసూ! ఒక ఫైలు అర్జెంటుగా కావాలట. మా బాసు నన్ను తీసుకురమ్మని కారు కూడా పంపించాడు' అన్నాడు.

వసుమతి లోలోపల సినిమా ప్రోగ్రాం తప్పిపోయినందుకు సంతోషించింది.

సూర్యం నీరుకారిపోయాడు.

"సరే! నేనుకూడా వెళ్తాను" అన్నాడు సూర్యం.

'నో! నో! నువ్వు రాత్రికి కూడా భోజనం చేసిగాని వెళ్ళడానికి వీల్లేదు. సినిమా ప్రోగ్రాం కూడా నాకోసం మానుకోవడం ఎందుకూ? మీరిద్దరూ నీ కారులో వెళ్ళండి. మీరు వచ్చేసరికి నేను ఇంటిదగ్గర ఉంటాను.'

వసుమతి నమ్మలేనట్టు భర్త ముఖంలోకి చూసింది.

సూర్యంకూడా విస్మయంగా సుబ్బారావును చూశాడు.

'ఏమిట్రా! అలా చూస్తావ్? నువ్వేం పరాయివాడివా? వసూ మీరిద్దరూ వెళ్ళండి.'

"సుబ్బారావు 'ఒరే' 'అరే' అంటూ మాట్లాడుతున్నా సూర్యం మాత్రం ఒక్కసారి కూడా 'రారా! చెప్పరా' అంటూ

మాట్లాడలేదు. ఆ విషయాన్ని వసుమతి గ్రహించింది. సుబ్బారావు ఆ విషయాన్ని గ్రహించే స్థితిలో లేడు.

'ఇలా రండి!' వసుమతి భర్తను పిల్చింది.

అప్పటికే సూర్యం తన కారు దగ్గర కెళ్ళి వసుమతికోసం ఎదురుచూస్తూ నిల్చున్నాడు:

"మీకేమైనా మతిపోయిందా ?"

నిజంగా మతిపోయినట్టే చూశాడు.

'పరాయి మగవాడితో నన్ను సినిమాకు వెళ్ళమంటా రేమిటి?'

'ఇష్ చిన్నగా, వాడేం పరాయివాడా? ఒక ఐ.ఏ.యస్. ఆఫీసరు వాడు. అయినా వాడితో నే నెంత చనువుగా ఉన్నానో చూస్తున్నావుగా?'

'కాని అతడు అలా ప్రవర్తించడం లేదు.'

'వాడి స్వ భా వ మే అంత. నువ్వు బయలుదేరు, బాగుండదు. నామాట పోతుంది. వాడి ముందు నా పరువు తియ్యకు. వసూ! ప్లీజ్!' ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

"తలుపులు తీసి ఉన్నాయ్" కసిగా అని ఉసిగా ముందుకు నడిచింది. సూర్యం స్టీరింగ్ ముందు కూర్చుని తన పక్కసీటు తలుపు తెరిచాడు. వసుమతి ఎక్కి కూర్చుంది. సూర్యం చెయ్యి ఊపుతుంటే తల తిప్పి చూసింది. సుబ్బా రావు నవ్వుతూ చెయ్యి ఊపుతున్నాడు.

'చవట! దద్దమ్మ' కసి కసిగా మనసులోనే అనుకుంది వసుమతి.

వసుమతికి తన భర్త అమాయకుడని తెలుసు. మంచి వాడని తెలుసు. కానీ మరీ మంచివాడు అంటే చవట అని తెలియదు. మొదటి సారిగా తెలుసుకొని వసుమతి మనసు చేదు చేదుగా ఉంది.

నాలుగు రోజులు ఉంటానన్నవాడు సూర్యం హైదరాబాద్‌లో పది రోజులు ఉన్నాడు.

సుబ్బారావు ఇంటికి తరచుగా రావడం, ముగ్గురూ కలసి సినిమాకో, పామ్‌హోటల్‌కో వెళ్తూ ఉండటం జరుగుతోంది. సుబ్బారావుకు మహా ఉషారుగా ఉంది. తెలిసిన వాళ్ళు కన్పిస్తేచాలు, వాళ్ళను ఆపి 'వీడు నా ఫ్రెండు, ఐ.ఏ.యస్. ఆఫీసరు' అని పరిచయం చేస్తాడు. అలా పరిచయం చేస్తున్నప్పుడు సూర్యం ఇబ్బందిగా, కొన్ని సమయాల్లో చిరాగ్గా ముఖం పెడ్తాడు. సుబ్బారావు అదేమీ పట్టించుకొనే స్థితిలో లేడు. వసుమతి మాత్రం లోలోపల బాధపడుతోంది. ఎన్నో సార్లు భర్తకు చెప్పాలని చూసింది. కాని అతడు విన్పించుకొనే మూడ్‌లో లేడు. వసుమతికి తల బాదుకోవాలనిపించేది. సూర్యం ప్రవర్తన కూడా ఆమెకు నచ్చడం లేదు.

ఆరోజు—మధ్యాహ్నం పన్నెండుకు సూర్యం సుబ్బారావు ఇంటి తలుపు తట్టాడు. తలుపు తెరిచి వసుమతి విస్మయంగా "మీరా ?" అన్నది.

'ఏం రాకూడదా?' నవ్వుతూ చొరవగా లోపలకు వచ్చాడు.

'ఈవేళప్పుడు ఆయన...'

'మీ ఆయన లేకపోతే నేను రాకూడదా?' అదోలా పలికింది అతడి కంఠం.

వసుమతికి ఏం సమాధానం ఇవ్వాలో తోచలేదు.

'ఎండలో వచ్చాను ఓ గ్లాసు చల్లటి నీళ్ళివ్వకూడదూ?' అతడి కంఠం బొంగురుగా పలికింది.

"సారీ!" అంటూ ఫ్రిజ్‌లో సీసాతీసి గ్లాసులో నీళ్ళు పోసి యాదాలాపంగా అతడికి గ్లాసు అందించింది. ఆ సమయంలో ఆమె అతడ్ని ఎలా వదిలించుకోవడమా అని ఆలోచిస్తోంది.

ఖాళీ గ్లాసు అందుకోవడానికి చాచిన వసుమతి చేతిని కుడిచేత్తో పట్టుకొని ఆమె కళ్ళలోకి కాంతుగా చూశాడు.

ఆమె ఒక్కసారిగా చెయ్యి లాక్కుంది.

"యూ! యూ! రాస్కెల్" కోపంతో బుసలుకొడ్తూ అన్నది.

"ఎందుకరుస్తావ్? ఇలాంటి భార్యాభర్తల్ని చాలా మందిని చూశాను. నీ మొగుడే..."

"నోరుముయ్!"

ఆమె అలా ప్రవర్తిస్తుందని ఊహించని సూర్యం ఆమెను అంత కోపంలో చూస్తూ ఆలోచనలో పడ్డాడు. బెట్టు చేస్తోందా? అంతే అయివుండాలి. లేకపోతే వాడి ప్రవర్తనకు అర్థం?

"ఛీ! నువ్వొ ఒక మనిషివేనా?" తుపుక్కున ఊసింది వసుమతి.

సూర్యం బిత్తరపోయాడు.

'ఆయన అమాయకుడు. మంచివాడు. తెల్లనివన్నీ పాలు అనుకునేవాడు. చిన్ననాటి స్నేహితుడ్ని అంత పెద్ద పదవిలో చూచి ఈర్ష్యపడలేనివాడు. ఆ పదవి తనకే లభించినట్టు ఆనందించేవాడు. ఎందుకూ? ఐ.ఏ.యస్. పాసయ్యావు? దేశంలో ఇంటలెక్ట్యుయల్స్ అనబడే వారిలో ఒకడిగా ముద్ర వేయించుకున్న వాడివి. స్నేహితుడి మనసును అర్థంచేసుకోలేని మూర్ఖుడివి. లే! ముందు బయటికెళ్ళు' సివంగిలా అరవసాగింది. మరో క్షణం ఉంటే ఏదైనా తీసుకొని తల బద్దలు కొట్టేలా ఉందనుకొన్నాడు సూర్యం.

గాభరాగా లేచి కారుకేసి నడిచాడు. కారులో కూర్చుని స్టార్ట్ చేస్తుండగా సుబ్బారావు ఇంటికి వచ్చాడు.

అతడ్ని దాటుకుని స్పీడుగా కారు వెళ్తుంటే "ఒరేయ్ సూరీ! ఆగరా! వెళ్ళిపోతావేం?" వెనకనుంచి అరుస్తూనే ఉన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు ఆశ్చర్యంగా కారు కన్పించినంతవరకూ చూస్తూనే ఉన్నాడు.

తలలో అనేక ప్రశ్నలు—సందేహాలు-గిర్రున తిరిగి లోపలకు వచ్చాడు.

'సూర్యం ఎందుకు అలా వెళ్ళిపోతున్నాడు? ఏమన్నా అన్నావా?' సుబ్బారావు ప్రశ్న విని వసుమతి నిలువెల్లా కంపించింది. కోపంతో కాదు అసహ్యంతో.

నిర్లక్ష్యంగా భర్త ముఖంలోకి చూసింది.

సుబ్బారావు మెదడు చురుగ్గా పనిచెయ్యసాగింది. అసలు వాడు ఈవేళప్పుడెందుకొచ్చినట్టు? తనను చూసి ఎందుకలా భయపడి పారిపోయాడు?

"ఎంత కాలం నుంచి సాగుతోంది?"

భర్త ప్రశ్నకు చివ్వున తలెత్తి విస్మయంగా చూసింది వసుమతి.

'మాట్లాడవే?' గర్జించాడు.

'ఏమిట?'

'వాడెందుకొచ్చాడు?'

'రోజూ ఎందుకొస్తున్నాడూ'

'ఈవేళప్పుడు నేను ఇంట్లో ఉండనని తెలిసీ?'

'అదికూడా చెప్పాలా?' అదోలా నవ్వింది వసుమతి.

"ఛ! సిగ్గులేదు'"

"నాకెందుకు సిగ్గు? నువ్వేగా మా ఇద్దర్నీ ఎంకరేజ్ చేశావ్? సినిమాలకు పంపావ్? హోటళ్ళకు పంపించావ్!"

"అయితే ఇంత నీచానికి దిగజారతావా?"

"మొగుడు దద్దమ్మైతే ఆడది ఏం చేస్తుంది?" నిర్లక్ష్యంగా అన్నది వసుమతి.

"నోర్ముయ్!" చెయ్యి పైకెత్తాడు సుబ్బారావు.

"చెయ్యి దించు" అంతకంటే గట్టిగా అన్నది వసుమతి.

సుబ్బారావు చెయ్యి కిందకు వాలిపోయింది.

భార్య ముఖంలోకి పిచ్చి చూపులు చూశాడు.

"ఏమిటా చూపులు. నిన్ను చూస్తుంటే నాకు అసహ్యం వేస్తోంది. నేనేం చేస్తానో నాకే తెలియదు బయటికెళ్ళు."

సుబ్బారావు బిత్తరపోయాడు.

"వెళ్తావా? లేదా?" నీళ్ళ సీసా చేతిలోకి తీసుకొని విసరడానికి సిద్ధం అయింది వసుమతి.

సుబ్బారావుకు నిజంగానే సీసా మీదకు విసురుతుందేమో నని భయం వేసింది.

పరుగులాంటి నడకతో బయటకు నడిచాడు.

వీధి గుమ్మం దగ్గరకొచ్చి "చూస్తానే! నీ సంగతి, వాడి సంగతి చూస్తాను" అతడి కంఠంలో ఏడుపూ కోపం మెలివేసుకొన్నాయి.

"ఏమిటీ నువ్వు చూసేది దద్దమ్మవు" బయటికి వచ్చింది వసుమతి.

వీధిగుమ్మం దాటి వెనక్కు చూస్తూ "ఏం కొడ్తావా?" అన్నాడు సుబ్బారావు.

వసుమతి చేతిలోని సీసా విసరబోయింది.

సుబ్బారావు పరుగులాంటి నడకతో పక్క సందున పడిపోయాడు.

వసుమతి అలా వెళ్తున్న భర్తను చూస్తూ నవ్వింది. మొనాలిసాలా నవ్వింది.

ఆ నవ్వులో జాలే ఉందో, కోపమే ఉందో, అసహ్యమే ఉందో చెప్పడం కష్టం.

o o o